సాక్షి
సంగారెడ్డి
శనివారం : 22 : జూలై : 2023



గూడు చెదిరే..

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు సామాన్యుడి గూడు చెదిరింది. రెక్కలు ముక్కలు చేసుకొని అపురూపంగా నిర్మించుకున్న పూరిళ్లు, పెంకుటిళ్లు వాన దెబ్బకు నెలకొరిగాయి. 8లో



తప్పులు లేని ఓటరు జాబితాకు..

ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులు సిబ్బందికి సూచించారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు జాబితా సవరణపై ప్రొఫెసర్ శకుంతల, ఆయేషా బేగం శిక్షణ ఇచ్చారు. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తొమ్మిది మందికి కోవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదే విధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పదిమందికి చేసినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

- కలెక్టర్ డాక్టర్ శరత్



కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో వాతావరణ శాఖ హెచ్చరికతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం తెలిపారు. వర్షాలు ఏకధాటిగా పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుకోని సంఘటనలు జరిగి, అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూం 08455 272233 నంబర్‌కు ఫోన్‌చేసి విషయం తెలపాలన్నారు. ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. మూడు షిఫ్ట్ లలో పనిచేసేలా సిబ్బందిని నియమించామని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, పంచాయతీ, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్, వ్యవసాయ, ఉద్యాన, నీటి పారుదల, పశుసంవర్ధక, పోలీస్ శాఖల సిబ్బంది అందుబాటులో ఉంటాన్నారు.

ఎన్నికల టోల్ ఫ్రీ 1950 ఏర్పాటు

సంగారెడ్డి టౌన్: కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించి ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన, ఓటర్ జాబితా, ఫారం 6,7,8పై సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ 1950తో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం తెలిపారు. ఈ కాల్ సెంటర్ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందన్నారు. ఓటరు జాబితా, నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపుపై సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని, ఫిర్యాదు కూడా చేయొచ్చని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కోఆర్డినేటర్ డాక్టర్ సంగారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కోఆర్డినేటర్ డాక్టర్ సంగారెడ్డి

నారాయణఖేడ్: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రోగులకు సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కోఆర్డినేటర్ డాక్టర్ సంగారెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని చర్యలు చేపడుతోందన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు వైద్యసేవలు అందించాలన్నారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ వెంకటలక్ష్మి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అదనపు కలెక్టర్లు



పుష్పగుచ్ఛం ఇస్తున్న అదనపు కలెక్టర్లు

సంగారెడ్డి టౌన్: బదిలీపై వచ్చిన అదనపు కలెక్టర్లు బి.చంద్రశేఖర్, ఆర్‌డి మాధురి శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం లో కలెక్టర్ డాక్టర్ శరత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కలెక్టర్ వారిని సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి టౌన్: ప్రజలు ప్రమాదాలబారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జాతీయ విపత్తుల నివారణ బృందం కమాండెంట్ ఎస్‌కె కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని కులబ్‌గూర్ గ్రామాన్ని సందర్శించారు. ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలి, ప్రమాదం జరగకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, వైద్య బృందం, పంచాయతీ సిబంది తదితరులు పాల్గొన్నారు.



నీట మునిగిన పంటలు

- జహీరాబాద్, ఝరాసంగం డివిజన్లలో తీవ్ర నష్టం
- జిల్లాలో పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయం
- జనజీవనం అస్తవ్యస్తం
- సింగూరు ప్రాజెక్టుకు ఒక్కరోజే ఒక టీఎంసీ వరద నీరు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. వరద నీరు చేరడంతో పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జహీరాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో, వసంత్‌విహార్ కాలనీలో ఇళ్లలోకి వరద నీరు రావడంతో స్థానికుల అవస్థలు వర్ణనాతీతం. కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే మాణిక్‌రావు సందర్శించి బాధితులను పరామర్శించారు. అలాగే.. పంటలన్నీ నీట మునిగాయి. పత్తి, మొక్కజొన్న, మినుము పంటలు బాగా దెబ్బతిన్నాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. 13 చెరువులు మత్తడి దుంకుతున్నాయి. ఈ వర్షాలు వరి పంటకు కొంత మేలు చేయగా, పత్తి, మినుము, మొక్కజొన్న, కంది పంటలు నీట మునిగాయి. ప్రధానంగా జహీరాబాద్, రాయికోడ్ వ్యవసాయ డివిజన్‌ల పరిధిలోని పలు మండలాల్లో వేలాది ఎకరాలు నీట మునిగాయి. ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్న పంట పొలాల్లోకి నీరు చేరడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు.

గుమ్మడిదలలో అధిక వర్షపాతం

జిల్లాలో అత్యధికంగా గుమ్మడిదలలో 5.0 సెం.మీ వర్షపాతం నమోదైంది. మునిపల్లి (కంకోల్)లో 4.6 సెం.మీ, పుల్కల్ (లక్ష్మీసాగర్)లో 4.3 సెం.మీ, చౌటకూర్‌లో 4.2 సెం.మీ, హత్నూరలో 3.1 సెం.మీ, మొగుడంపల్లిలో 2.8 సెం.మీ, వట్‌పల్లి, జహీరాబాద్‌లో 2.2 సెం.మీ, అందోల్ (అన్నాసార్), సదాశివపేటలో 2.1సెం.మీలు, కోహీర్, కొండాపూర్‌లలో 2 సెం.మీ, ఝరాసంఘంలో 1.9 సెం.మీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

చెరువులకు జలకళ

జిల్లాలో మొత్తం 1,768 చెరువులు ఉండగా.. ప్రస్తుతం 13 మత్తడి దుంకుతున్నాయి. ఇందులో 25 శాతం నిండిన చెరువులు 49 ఉండగా, 25 శాతం నుంచి 50 శాతం నిండిన చెరువులు 1,070 ఉన్నాయి. 50 నుంచి 75 శాతం నిండినవి 517 కాగా, 75 నుంచి 100 శాతం నిండిన చెరువులు 119 ఉన్నట్లు నీటి పారుదల శాఖ గుర్తించింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు పొంగి ప్రవహించాయి. కాగా, సింగూరు ప్రాజెక్టుకు గురువారం ఒక్కరోజే ఒక టీఎంసీ వరద నీరు వచ్చి చేరింది. శుక్రవారం సాయంత్రం 6 గంటల వరకు సగటున 12,515 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 20 టీఎంసీలకు చేరింది. మంజీరా డ్యాంకు 5,778 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ఈ డ్యామ్ ప్రస్తుత నీటి సామర్థ్యం ఒక టీఎంసీకి చేరింది. నారాయణఖేడ్ మండలం గంగాపూర్ ర్యాకల్ రిజర్వాయర్ నిండి అలుగు పారుతోంది. ఝరాసంగం మండలంలోని ప్యారవరం శివారులో వాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. రెండేళ్ల తర్వాత దబ్బ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ అలుగు పారుతోంది.

సింగూరుకు పోటెత్తిన వరద



- 12515 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఈ సీజన్‌లో రెండున్నర టీఎంసీల నీరు చేరిక
- ప్రతీ మూడు గంటలకు ఇన్‌ఫ్లో అంచనా

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. శుక్రవారం 12,515 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. అల్ప పీడన ప్రభావంతో వారం రోజులుగా వర్షం కురుస్తుండటంతో డ్యాంలోకి రోజురోజుకు వరద పెరుగుతోంది. ప్రాజెక్టు ఎగువ పరీవాహకంలోని వట్‌పల్లి, రేగోడ్, రాయికోడ్, మునిపల్లి, ఝరాసంఘం, మనూరు, నాగిల్ గిద్ద మండలాల్లో కురుస్తున్న వర్షపు నీరు డ్యామ్‌లోకి చేరుతోంది. దీంతో నీటి మట్టం పెరుగుతోంది. డ్యామ్‌లోకి జూలై 7 నుంచి ఇన్‌ఫ్లో ప్రారంభంకావడంతో వరద నీరు చేరుతోంది. గత వారం నుంచి ఎక్కువ వర్షాలు కురియడంతో ఎక్కువ ఇన్‌ఫ్లో పెరిగింది. ఈ సీజన్‌లో డ్యాంలోకి ఇప్పటి వరకు రెండున్నర టీఎంసీల నీరు చేరిందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో అధికంగా రావడంతో నీటి పారుదల శాఖ అధికారులు ప్రాజెక్టు వద్దే ఉంటూ వరద పరిస్థితిని అంచనా వేస్తున్నారు. ప్రతీ మూడు గంటలకు ఓసారి వరద ప్రవాహం రీడింగ్ నమోదు చేస్తున్నారు.

- ప్రాజెక్టు నీటిమట్టం 523.6 మీటర్లకు 29.600 టీఎంసీలు. ప్రస్తుతం డ్యామ్‌లో 521.595 మీటర్లకు 20.267 టీ ఎంసీల నీటి నిల్వ ఉందని ఏఈఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. డ్యామ్ నుంచి మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రోవాటర్ సరఫరాకు 70 క్యూసెక్కులను సరఫరా చేస్తున్నారు.
- సింగూరు ప్రాజెక్టు దిగువన ఉన్న మంజీరా రిజర్వాయర్ 1.5 టీఎంసీల సామర్థ్యమే కావడంతో త్వరగా నిండుతుంది. ప్రస్తుతం ఈ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోవడంమే దిగువకు నీటిని వదలటానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దిగువన మంజీర నది పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

'నారింజ'కు పెరిగిన ఉధృతి



నారింజ ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

- ప్రాజెక్టులోకి 4,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- రెండు షట్టర్లు ఎత్తి అంతే నీటిని దిగువకు తరలింపు
- పరిశీలించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోగల నారింజ వాగు ప్రాజెక్టుకు వరద నీటి ఉధృతి పెరిగింది. శుక్రవారం ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు పోటెత్తింది. ప్రాజెక్టును ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సందర్శించి పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇన్‌ఫ్లో 4,400 క్యూసెక్కులుగా ఉన్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు గుర్తించారు. వరద నీరు షట్టర్ల పైనుంచి ప్రవహిస్తుండడంతో రెండు షట్టర్లను పైకెత్తి ఇన్‌ఫ్లో మేరకు అంతే స్థాయిలో దిగువకు వదులుతున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. సాయంత్రం నుంచి కొంత మేర ఉధృతి తగ్గినట్లు గుర్తించారు. వేసవిలో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులో నీరు సమృద్ధిగా ఉండటంతో ఒక్క వర్షానికే ప్రాజెక్టులో నీరు నిండింది. ప్రాజెక్టు సామర్థ్యం 0.85 క్యూసెక్కులు. దీంతో అదనపు నీటిని దిగువన ఉన్న కర్ణాటకకు వదులుతున్నారు. వరద పరిస్థితిని నీటిపారుదల శాఖ సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ మురళీధర్, ఈఈ విజయ్‌కుమార్ ప్రాజెక్టును సందర్శించి పరిశీలించారు. ఇన్‌ఫ్లో ఆధారంగా అవుట్ గోయింగ్ మేయింటెనెన్స్ చేయాలని, దగ్గరుండి పరిస్థితిని పరిశీలించాలని డీఈఈ వెంకట్ రాంరెడ్డి, ఉదయ్ భాస్కర్, జనార్ధన్, ఏఈలు జానకీరాం, శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు రఘు, మహబూబ్‌ను ఆదేశించారు. ప్రాజెక్టును ఎంపీడీఓ సుమతి, గ్రామ సర్పంచ్ జగన్మోహన్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు వారికి కనీస వేతనం చెల్లించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ శరత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 16 రోజులుగా సమ్మె చేస్తున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్మికులు, ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయడంతో పాటు, కనీస వేతం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, మెడికల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం యూనియన్లతో చర్చించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.అశోక్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, టీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రవీణ్, సమత సైనిక్ దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు గైని బస్వరాజ్, జిల్లా కమిటీ సభ్యుడు దాసు తదితరులు పాల్గొన్నారు .

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లతో కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ఇబ్బందిపడకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరకుండా రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్ శాఖలు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిథిలావస్థలోఉన్న ఇళ్లలో ప్రజలు ఉండకుండా ఖాళీ చేయించి వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నందున అటువైపు ఎవరూ వెళ్లకుండా హెచ్చరికలు చేయాలని సూచించారు. వాగులు, బ్రిడ్జిల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేసేలా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు అప్రమత్తంగా ఉంటూ ముందస్తు సమాచారాన్ని కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు తెలపాలన్నారు. ప్రాణనష్టం సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల వల్ల పంట నష్టం జరిగితే వెంటనే తెలియజేయాలన్నారు. ప్రాథమిక వైద్యశాలల్లో మందులు, 108 వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలలో అధిక వర్షాలతో వరదలు సంభవిస్తే ప్రజలను తరలించేలా భవనాలను గుర్తించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ నగేష్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకకు నిలిచిన రాకపోకలు



వెనుదిరిగి వస్తున్న గ్రామస్తులు

జహీరాబాద్: మండలంలోని బూచనెల్లి నుంచి సరిహద్దు కర్ణాటక రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. నారింజ ప్రాజెక్టు నుంచి వరద నీటిని దిగువకు వదలడంతో బూచనెల్లి వద్ద ఉన్న బ్రిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో జహీరాబాద్ నుంచి బూచనెల్లి మీదుగా కర్ణాటకలోని మన్నెల్లి, బరూర్ ప్రాంతాలకు వెళ్లే రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగుకు అటువైపున ఉన్న పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

అక్రమ కట్టడాలు కూల్చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



సిబ్బందిని ఆదేశిస్తున్న కలెక్టర్ శరత్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు

జహీరాబాద్: వాగులపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేసి, వరద నీరు ప్రవహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఆర్డీఓ వెంకారెడ్డి, నీటి పారుదల శాఖ ఈఈ విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డితో కలిసి వరద ముంపునకు గురైన జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని వసంత్ విహార్ కాలనీని సందర్శించి పరిశీలించారు. వరద నీరు సజావుగా వెళ్లనందునే ఎగువ ప్రాంతంలోని కాలనీ జలమయమైనట్లు గుర్తించారు. దిగువన ఉన్న ఇంద్రప్రస్థ, ఎస్‌కే వెంచర్లలో వాగులకు అడ్డంగా కట్టడాలు నిర్మించి వాగులను దారిమళ్లించడం వల్లే దిగువ ప్రాంతాలకు సక్రమంగా నీరు వెళ్లక సమస్యలు తలెత్తినట్లు తెలుసుకున్నారు. వాగులకు అడ్డుగా నిర్మించిన కట్టడాలను పూర్తిగా తొలగించాలని, నీటిపారుదల శాఖ సహకారంతో మ్యాప్‌లో సహజ సిద్ధంగా ఏ మేరకు వాగులు ఉన్నాయో గుర్తించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. గుర్తించిన విధంగా వాగులను తవ్వించాలన్నారు. ఇందుకయ్యే ఖర్చు వెంచర్ల యజమానుల నుంచే వసూలు చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు అనువుగా లేని వెంచర్లలో ప్లాట్లను కొనుగోలు చేసి ఇబ్బందులు పడొద్దని ప్రజలకు సూచించారు. వాగులను దారిమళ్లించినందుకు చర్యలు ఎందుకు చేపట్టవద్దో ప్రశ్నిస్తూ నోటీసులు సైతం జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

సంగారెడ్డి టౌన్: ఏకధాటికిగా కురుస్తున్న వానలు తగ్గిన వెంటనే ఇంటి పరిసరాల ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్త పడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గాయత్రి దేవి సూచించారు. తాగునీటి పైప్ లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించుకోవాలన్నారు. పరిశుభ్రమైన నీటిని తాగాలన్నారు. కూలర్లు, పూల తొట్లలో నిల్వ నీటిని పారబోయాలన్నారు. దోమలు, ఈగలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు.



జల దృశ్యం

ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో మొగుడంపల్లి మండలంలోని వాటర్ ఫాల్(ఎత్తిపోతల)కు జలకళ వచ్చింది. ఈ వాటర్ ఫాల్ తెలంగాణ - కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని జాడిమల్కాపూర్ గ్రామానికి సమీపంలో ఉంది. దీనిని చూసేందుకు పర్యాటకులు వస్తుంటారు. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడటంతో వాటర్ ఫాల్‌కు భారీగా వరదనీరు వస్తుంది. చిన్న కొండల మధ్య నుంచి పెద్ద లోయలోకి నీరు జాలీ పడుతున్న దృశ్యాలు పర్యాటకులను ఆకర్షిస్తుంది. ప్రజలు ఎత్తిపోతలను చూసేందుకు వస్తున్నారు.

\- జహీరాబాద్ టౌన్

క్లుప్తంగా

స్టార్టర్ బోర్డులో షార్ట్ సర్క్యూట్



షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

నర్సాపూర్ రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో మండలంలోని అవంచ ఎస్సీ కాలనీలో శుక్రవారం ఉదయం మంటలు చెలరేగాయి. ఎస్సీ కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ కాలనీలోని డప్పు రమేష్ ఇంటిని ఆనుకొని.. గ్రామానికి తాగునీటి సరఫరా చేసే బోర్‌కు సంబంధించిన మీటర్, స్టార్టర్ ప్యానల్ బోర్డు గ్రామపంచాయతీ సిబ్బంది ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉదయం మీటర్ స్టార్టర్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఎస్సీ కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు విద్యుత్ శాఖ లైన్‌మెన్‌కు ఫోన్ చేసి చెప్పగా,సరఫరా నిలిపివేశారు.

ఉర్దూ మీడియం సమస్యలపై ఫిర్యాదు



మంత్రికి సమస్యలు వివరిస్తున్న అక్తర్ అహ్మద్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఉర్దూ మీడియానికి సంబంధించిన సమస్యలపై మంత్రి హరీశ్‌రావుకు ఫిర్యాదు చేసి వినతిపత్రం అందజేశామని ఎంఐఎం నియోజకవర్గం అధ్యక్షుడు అక్తర్ అహ్మద్ చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియొద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రిని హైదరాబాద్‌లో కలిశామన్నారు. ఉర్దూ మీడియం పాఠశాలలో టీచర్లు, జూనియర్, డిగ్రీ కళాశాలలో లెక్చరర్లను నియమించాలని కోరామన్నారు. జహీరాబాద్‌కు ఉర్దూ మీడియం డీఎడ్ కళాశాల, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని విన్నవించినట్లు చెప్పారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జహీరాబాద్: పట్టణ శివారులోని ఓ వెంచర్ మధ్యలో ఉన్న వరదవాగుపై అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది జేసీబీతో కల్వర్టు, గోడలను తొలగించారు. వర్షం నీరు సవ్యంగా ముందుకు వెళ్లకపోవడంతో అధికారులు వెంచర్ మధ్యలో ఉన్న వాగుకు అడ్డంగా నిర్మించిన నిర్మాణాలు పూర్తిగా తొలగించారు.

గూడు చెదిరే..

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు సామాన్యుడి గూడు చెదిరింది. రెక్కలు ముక్కలు చేసుకొని నిర్మించుకున్న పూరిళ్లు, పెంకుటిళ్లు వాన దెబ్బకు నేలకొరిగాయి. కళ్ల ముందే తమ ఇళ్లు కూలిపోతుండటం చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోన మదనపడుతున్నారు. కాగా, ముసురు ఎంతో ముప్పు తెచ్చిపెట్టిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నర్సాపూర్ రంగంపేటలో కూలిన ఇల్లు

సాక్షి, న్యూస్ నెట్‌వర్క్ : ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాల ధాటికి సిద్దిపేట కొమురవెల్లిలో మండలంలోని గురువన్నపేట, అయినాపూర్‌ల్లో 4 ఇళ్లు కూలిపోయాయి. మద్దూరు లద్నూర్‌లో భోగి సబితకు చెందిన ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. దౌల్తాబాద్, రాయపోలు మండలాల్లో మహ్మద్ షాపూర్‌లో గోడలు తడిసి సంగనిస్వామి అనే వ్యక్తి పెంకుటిళ్లు కూలింది. వడ్డేపల్లిలో అయ్యగళ్ల లక్ష్మీ నర్సయ్యకు చెందిన గుడిసె, బేగంపేటకు చెందిన తిప్పని ఐలమ్మకు చెందిన పూరిల్లు ధ్వంసమైంది. వర్గల్‌లో తౌటి స్వరూప వెంకటేశం దంపతుల ఇల్లు అర్ధరాత్రి తర్వాత కుప్పకూలింది. మరో 5 ఇళ్లకు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వర్గల్‌లోనే మరొకటి, శేరిపల్లిలో ఒకటి, శాకారంలో 2, జబ్బాపూర్‌లో ఇల్లు పాక్షిక నష్టం వాటిల్లింది. గిర్మాపూర్‌లో జనావాస ప్రాంతంలో చెట్లు విరిగి పడ్డాయి. కాగా శివ్వంపేటలో 4, దొంతిలో 7, కొత్తపేటలో 2, లింగోజిగూడలో 2, సికింద్లాపూర్‌లో 2, తిమ్మాపూర్‌లో ఇల్లు పాక్షికంగా కూలింది. నవాబుపేట సాంబయ్య చెరువు నిండి అలుగు పారుతోంది. గురురాత్రి పిడుగుపాటుకు బాసంపల్లి నర్సింలు రైతుకు చెందిన లేగదూడ మృత్యువాత పడింది. పటాన్‌చెరు బొల్లారం మున్సిపల్ పరిధిలోని పలు పురాతన ఇళ్లు కూలాయి. జిన్నారంలోని పలు పెంకుటిళ్లు కుప్పకూలాయి.

అందోల్ మునిపల్లిలో మేళసంగ్యంలో 1, మునిపల్లిలో 3 ఇళ్లు కూలిపోయాయి. సంగారెడ్డి సదాశివపేటలో పట్టణంలోని 25వ వార్డులో డప్పూరి చంద్రశేఖర్ ఇల్లు కూలింది. రాష్ట్ర హ్యాండ్లూమ్స్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ కుమారుడు చింతా సాయినాథ్ బాధితుడి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కొడిపల్లిలో 23 పూరిళ్లు పాక్షికంగా కూలినట్లు డిప్యూటీ తహసీల్దార్ తారాబాయ్, ఆర్ శ్రీహరి శుక్రవారం తెలిపారు. మనోహరాబాద్‌లోని పలు గ్రామాల్లో 9 పాక్షికంగా కూలాయి. కోనాయపల్లి(పీటీ)లో చిర్మని మహేశ్‌కు చెందిన ఇల్లు, చెట్లగౌరారంలో 2, జీడిపల్లి 3, పర్కిబండ 2, పోతారం ఒక ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. సదాశివపేట రూరల్లో మండల పరిధిలోని ముబారక్ పూర్(ఏ)కు చెందిన షరీఫొద్దీన్ ఇల్లు కూలింది. కొండపాకలో 5 ఇళ్లు కూలిపోయాయి. మర్పడ్గ, దుద్దెడ, జప్తినాచారం, మంగోల్‌ల్లోని చెరువులు అలుగు పారుతున్నాయి. కొల్చారం రంగంపేటలో కూలిన ఇల్లు కూలింది. చిన్నశంకరంపేటలోని ఖాజాపూర్‌లో 6 , మరిన్ని గ్రామాల్లో మరో 11 ఇళ్లు కూలాయి.



రాయపోలు: మహ్మద్‌షాపూర్‌లో..



వర్గల్‌లో ..



కొమురవెల్లి: అయినాపూర్‌లో..



శివ్వంపేట మండలం సికింద్లాపూర్‌లో ..



జిన్నారంలో కూలిన పైకప్పు



కొండపాకలో



లక్ష్మీప్రసన్ననగర్ ప్రధాన రోడ్డుపై ఉబికి వస్తున్న మురుగు

నిబంధనలకు నీళ్లు

ఇళ్లల్లోని వర్షపు నీటి ప్రవాహం పారడానికి యూజీడీ కనెక్షన్ ఇవ్వకూడదు. కొన్ని ప్రాంతాల్లో అధికారులిచ్చారు. దీంతో మురుగునీరు ఉప్పొంగి, రహదారులపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. మరో వైపు భారీ వర్షాలకే యూజీడీ చాంబర్లు ఉప్పొంగడం కూడా లోపభూయిష్ట పనులకు తార్కాణంగా నిలుస్తోంది.

- యూజీడీ పనులు లోపభూయిష్టం
- వర్షమొస్తే చాంబర్ల నుంచి ఉబికొస్తున్న వైనం
- రోడ్లపైకి చేరుతోన్న మురుగు
- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో.. ఇదీ దుస్థితి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు లోపభూయిష్టంగా సాగడంతో లోపాలు బయటపడుతున్నాయి. తాజా భారీ వర్షాల నేపథ్యంలో యూజీడీ చాంబర్‌ల నుంచి మురుగు ఉబికి రోడ్లపైకి వస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్, సిరిఎన్‌క్లేవ్ తదితర కాలనీల్లో మురుగు ఉబికి బయటకొస్తుండడం, రహదారులపై దుర్గంధం వెదలజల్లుతుండడం అందుకు నిలువుటద్దం. సాధారణంగా యూజీడీ కనెక్షన్ వంటగదుల, టాయ్‌లెట్లు, స్నానపు గదుల మురుగు పారుదలకు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. కానీ నిబంధనలకు పాతరేసి పలుచోట్ల ఇళ్లల్లో వర్షపు నీటికి ఇవ్వడంతో ఈ దుస్థితి నెలకొంది. మురుగు నివారణకు చేపట్టిన నిర్మాణం తిరిగి దానిని రోడ్లపై వదులుతున్నారు. దీంతో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అంచనాలను ఇటీవల రూ.99 కోట్ల నుంచి 155 కోట్లకు అమాంతంగా పెంచారు. లోపాలు సరి చేసి, పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై కథనం.

నిధులిలా వచ్చాయి..

సీఎం కేసీఆర్ తన ఇలాకాలో.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) కింద రూ.99 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌ల్లో 2020 జూన్‌లో 138 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగు పైప్‌లైన్ వ్యవస్థతోపాటు 4 చోట్ల ఎస్‌టీపీ(సేవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల నిర్మాణం పనులు ప్రారంభించారు. అందులో పైప్‌లైన్ల పనులు సాగుతుండగా, 4 ఎస్‌టీపీలు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఇక ఇళ్ల కనెక్షన్ల పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 8,600 ఇళ్ల కు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 7 వేల పైగా ఇచ్చినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

అంచనా వ్యయం పెంపు

యూజీడీకి విడుదలైన రూ.99కోట్ల పనులతో పూర్తిగాక అధికారులు అంచనా పెంచారు. నిజానికి ముందున్న ప్రతిపాదనల్లో 138 కిలోమీటర్ల పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంటే ప్రస్తుతం కేవలం 99 కిలోమీటర్ల వరకే పనులు పూర్తిచేశారు. కానీ పట్టణంలో ఇంకా పనుల్లో పైపులైన్లు నిర్మించాల్సిన కాలనీలున్నాయి. వీటి కోసం అదనపు నిధులు కోరామని అధికారులు చెబుతున్నారు. అదనంగా వచ్చిన రూ.56 కోట్లతో సుమారుగా 99 కిలోమీటర్ల నుంచి 130 కి.మీపైగా పైప్‌లైన్ పనులు పూర్తి చేశామని చెబుతున్నారు. పట్టణ అవసరాలను ముందుగానే అంచనా వేయడంలో అధికారులు విఫలం కావడంతో రెండోసారి అంచనాలు పెంచారని తెలుస్తోంది. పనులు సుమారుగా పూర్తి చేశామని అధికారులు చెబుతున్నా కోటమైసమ్మ రోడ్డు వైపు, పలు కాలనీల్లో ఇంకా పనులు కొనసాగుతున్నాయి.

లోపాలు సరిచేయిస్తాం

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని యూజీడీ పనుల్లో లోపాలు బయటపడుతున్న మాట వాస్తవమే. చాంబర్ల నుంచి మురుగు ఉబికి రావడానికి ఇళ్లల్లో వర్షపు నీటి కనెక్షన్లు ఇవ్వడమే కారణం. వీటిని పరిశీలించి తొలగిస్తాం. మురుగు ఇక నుంచి బయటకు రాకుండా చూస్తాం. ఇతర చిన్న, చిన్న లోపాలు సరిచేసి త్వరలోనే వంద శాతం పనులు పూర్తి చేస్తాం.

–వీర ప్రతాప్, ప్రజారోగ్యశాఖ ఈఈ

స్నేహితుడిని కలిసేందుకు వెళ్తూ..

- బైక్, లారీ ఢీకొని ఇద్దరి మృతి
- చేగుంట 44వ నంబర్ జాతీయ రహదారిపై ఘటన



బాలాజీసింగ్



రవితేజ

చేగుంట(తూప్రాన్): బైక్, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన చేగుంట శివారులోని మక్కరాజీపేట బైపాస్ బ్రిడ్జి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామయంపేట మండలం జాన్సిలింగాపూర్‌కు చెందిన టాకూర్ బాలాజీసింగ్(32), కోళ్ల రవితేజ(20) బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. చిన్నశివునూర్ శివారు నుంచి వస్తున్న కంటైనర్, బైక్ మక్కరాజీపేట బైపాస్‌బ్రిడ్జి సమీపంలో 44వ నంబర్ రహదారిపై ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలాజీసింగ్, రవితేజలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలాజీసింగ్ కూలీ పనులు చేసుకునేవాడు కాగా, రవితేజ ఉపాధి హామీ పనులతోపాటు ఇతరేతర పనులు చేసుకునేవాడు. వీరిద్దరూ హైదరాబాద్‌లో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందారు. వీరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు అదృశ్యం

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు అదృశ్యమయ్యారు. నంగునూరులో ఇంటి నుంచి వెళ్లి ఒకరు, పటాన్‌చెరు పీఎస్‌పరిధిలో డ్యూటీకి వెళ్తున్నానని మరొకరు, ఝరాసంగం మండలంలో ఇద్దరు కూతుళ్లతో సహా తల్లి అదృశ్యమయ్యారు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం..

పటాన్‌చెరు టౌన్ : డ్యూటీకి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పీఎస్ పరిధిలో ఆలస్యంగా బుధవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన అబ్రహం కూతురు(21) మదీనగూడలోని జీఎస్ఎం మాల్లో పనిచేసుకునేది. ఈనెల 17న డ్యూటీకి వెళుతున్నానని ఇంటి నుంచి వెళ్లి ఎంతకీరాలేదు. ఆమె కుటుంబ సభ్యులు పనిచేసే చోటుకు వెళ్లి విచారించగా డ్యూటీకి రాలేదని తెలిపారు. దీంతో కుటుంబీకులు.. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలతో సహా తల్లి ..

ఝరాసంగం(జహీరాబాద్): పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని జీర్లపల్లికి చెందిన మీనాక్షి తన కూతుర్లు నందిని, జహన్వీలను తీసుకొని ఈనెల 20న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. తెలిసిన వారిని, బంధువులను విచారించినా వారి ఆచూకీ తెలియరాలేదు. వెంటనే భర్త భర్త శివకుమార్ పోలీసులకు ఆశ్రయించారు. ఎస్సై రాజేందర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అదృశ్యమైన తల్లీకూతుళ్లు

నంగునూరు(సిద్దిపేట): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన నంగునూరులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన దేవులపల్లి చంద్రయ్య (55) వారం రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాలేదు. బంధువులు, తెలిసిన వారిని విచారించినా ఆచూకీ తెలియరాలేదు. చంద్రయ్య భార్య దేవులపల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చంద్రయ్య

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు అన్యాయం

- ఐక్య ఉపాధ్యాయ పోరాట కమిటీ నాయకులు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నూతన పెన్షన్ విధానంతో ఉపాధ్యాయ, ఉద్యోగుల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని ఐక్య ఉపాధ్యాయ పోరాట కమిటీ నాయకులు న్నారు. జాయింట్ ఫోరమ్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం (జేఎఫ్ఆర్ఓపీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 23న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాత పెన్షన్ సాధన సదస్సును విజయవంతం చేయాలని అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, తప్పెట్ల యాదగిరి, సీఎచ్. విజేందర్ రెడ్డి, టీ.రాజిరెడ్డి మాట్లాడుతూ 2004 నుంచి దేశవ్యాప్తంగా ఈ నూతన పెన్షన్ విధానం అమలవుతోందని, దీని ఫలితంగా ఉపాధ్యాయులు, ఉద్యోగుల్లో తీవ్రమైన అసంతృప్తి ఉందన్నారు. అందుకే దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దేవరాజ్, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా నాయకులు సమ్మయ్య, కృష్ణ, నరసింహారెడ్డి, మల్లయ్య, కనకరాజు, ఎం.పద్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : వర్షపు నీరు పోయే కాలువలో పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని మై హోమ్ సయుక్ సమీపాన గల కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని కూలీలు గుర్తించారు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు కాలువలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీశారు. అతడి వయస్సు 40 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు వారు కేసు దర్యాప్తు చేసున్నారు.

అందోల్–జోగిపేట మున్సిపాలిటీకి రూ.25కోట్లు

వట్‌పల్లి(అందోల్): అందోల్–జోగిపేట మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తెలిపారు. అందోల్–మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద అందోల్–జోగిపేట అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.25 కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడంపై సీఎం కేసీఆర్‌కు, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

దత్తగిరి పీఠాధిపతులకు ఘనస్వాగతం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమ పీఠాధిపతులకు ఘనస్వాగతం పలికారు. అనసూయ మాత ఆధ్వర్యంలో చార్ధామ్ యాత్ర ముగించుకొని ఆశ్రమానికి వచ్చిన పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహరాజ్‌కు, డాక్టర్ సిద్దేశ్వర స్వామికి స్వాగతం పలికారు. ఆశ్రమంలో యజ్ఞంతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లోక కల్యాణార్థం దత్త హోమం దత్త యజ్ఞం, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అదేవిధంగా జ్యోతిర్లింగాల వద్ద అభిషేకం మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు శివ శంకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.